క్లుప్తంగా

నేటి నుంచి గంగమ్మతల్లి జాతర



కడప నబీకోట గంగమ్మ తల్లి మూలవిరాట్

కడప అర్బన్ : కడప నగరం నబీకోటలో వెలిసిన శ్రీ గంగమ్మతల్లి జాతర గురువారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గురువారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, చల్ల కార్యక్రమం నిర్వహిస్తారు. 14 వ తేదీన అమ్మవారికి అభిషేకం, నబీకోట శివాలయం నుంచి కలశాలతో ముత్తయిదువులతో నీళ్లను తీసుకుని వస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉచిత సుమంగళి కుంకుమార్చన, 15న శ్రీ గంగాదేవి కళ్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి 9 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 16న తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం, అలంకరణ, బోనాలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి చెక్కభజన కార్యక్రమం నిర్వహించనున్నారు.

రేపు గ్రహణం లేదు

కడప కల్చరల్ : శుక్రవారం చంద్రగ్రహణం లేదని జిల్లా అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు విజయ్‌భట్టర్ స్పష్టం చేశారు. 14న చంద్రగ్రహణం ఉందని కొందరు చెప్పడంతో ఈ అంశం విస్తృతంగా ప్రచారమైందని, ఈ సందర్భంగా చేయాల్సిన పలు కర్మకాండలకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. నిజానికి మన దేశంలో 2025లో సూర్య, చంద్రగ్రహణాలు వర్తించవని స్పష్టం చేశారు. గ్రహణం గురించిన ఆలోచన పెట్టుకోవద్దని ఆయన సూచించారు.

కష్టాల క్లస్టర్ ట్రైనింగ్‌ని రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులను క్లస్టర్ ట్రైనింగ్ పేరుతో అధికారులు వేదనకు గురిచేయడం తగదని ఈ ట్రైనింగ్‌ను వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయుల సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల సన్నద్ధత కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉండగా, మరికొందరికి పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారుల విధులు కూడా కేటాయించారని చెప్పారు. ఇలాంటి కీలక సమయంలో కూడా ఉపయోగం లేని క్లస్టర్ సమావేశాలకు హాజరుకావాలని అధికారులు ఆదేశించడం శోచనీయమన్నారు. గత నెలలో నిర్వహించిన క్లస్టర్ సమావేశాలు విఫలమైనా కూడా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయుల కష్టాలను విస్మరిస్తూ ఈ సమావేశాలు నిర్వహించడం అధికారుల ఒంటెద్దు పోకడకు నిదర్శనమన్నారు.

దైవభక్తితోనే ప్రశాంత సమాజం



మాట్లాడుతున్న క్రీస్తు సంఘం దైవజనులు కేకే సుధీర్

కడప కల్చరల్ : ప్రజల్లో దైవ భక్తి ఉన్నప్పుడే సమాజం ప్రశాంతంగా ఉండగలుగుతుందని క్రీస్తు సంఘం దైవజనులు కేకే సుధీర్ అన్నారు. బుధవారం ప్రకాష్ నగర్‌లోగల ప్రార్థన మందిరంలో పాస్టర్ పాలగిరి జాన్సన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సమావేశానికి తిరుపతికి చెందిన క్రీస్తు సంఘం దైవజనులు కేకే సుధీర్, వి.సుభాష్ చంద్రబోస్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ ప్రజలందరూ మూఢనమ్మకాల నుంచి బయటపడాలని, సత్యాన్ని స్వీకరించి దైవభక్తితో మెలగాలన్నారు. కృపా కాలనీకి చెందిన పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ చెడు మార్గంలో ఉండే వారిని మంచి మార్గం వైపు క్రీస్తు నడిపించారని, ఆయన బోధనలను అనుసరించి అందరూ ఆధ్యాత్మికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సేవకులు వి.కిరణ్, పి.రవితేజ, జె.లక్ష్మీ నారాయణ, పి.దానియేలు, యం.జ్ఞానేంద్ర, రాజ్ కుమార్, ఏ.అగస్టిన్ పాల్గొన్నారు.

హామీలు ఏమయ్యాయి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని డీవైఎఫ్ఐ నాయకులు విజయ్, నరసింహ, అభినయ్ ఉదయ్ అన్నారు. కడప డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలను అదానీ, అంబానీలకు తాకట్టు పెడుతూ ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారన్నారు. ఈ నెల 14న కడపలో జరిగే సదస్సుకు తరలిరావాలని కోరారు.

3, 4 తరగతుల విలీనాన్ని ఆపాలి

వల్లూరు (చెన్నూరు) : 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర నాయకులు లక్ష్మీరాజ మాట్లాడుతూ అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ ప్రైమరీ స్కూల్లో విలీనం చేస్తే ఉద్యమాలు చేపట్టవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సాహితీ సిరిమల్లె 'మొల్ల'

నేడు మొల్లమాంబ జయంతి

కడప కల్చరల్ : కవుల గడపగా పేరున్న మన జిల్లా ముద్దుబిడ్డ మొల్లమాంబ. సాహిత్య పరంగా జిల్లా ఔన్నత్యాన్ని పెంచిన మన ఆడబిడ్డ కులమతాల అసమానతలు రాజ్యమేలుతున్న ఆనాడే తన సాహితీ ప్రతిభతో ఆ కష్టాలను అధిగమించి ధీశాలిగా నిలిచింది. తెలుగు రామాయణ రచనతో తెలుగు సాహిత్య లోకంలో తనదైన ప్రత్యేక స్థానం సాధించుకున్నారు. ఇలాంటి మహిళా మణిని కన్నందుకు జిల్లా గర్విస్తోంది. గురువారం మొల్లమాంబ జయంతి. ఈ సందర్భంగా ఆమె గురించిన ప్రత్యేక కథనం.

■ తెలుగు సాహితీవనంలో విరబూసిన మల్లెపువ్వు మొల్లమాంబ. సాంఘిక దురాచారాలు, కులం కట్టుబాట్లు రాజ్యమేలుతుండిన ఆనాడే ఒక యువతి, అందునా వెనుకబడిన కులానికి చెందిన ఓ మహిళ తెలుగు జాతి గర్వించేలా 'రామాయణ' కావ్యాన్ని అద్భుతంగా రాయడం విశేషం. ఇందులో తన ప్రతిభ ఏమీ లేదని..అంతా శ్రీకంఠ మల్లేశ్వరుడు, శ్రీరామచంద్రుడి దయ మాత్రమేనని వినయం ప్రకటించారు. తెలుగు తల్లికి 'మొల్ల' పూదండ అలంకరించిన తెలుగు రామాయణకర్త మొల్లమాంబ. జిల్లాలో తొలి తెలుగు కవయిత్రిగా కీర్తి మొల్లమాంబకే దక్కింది.

గోపవరంలో..

చరిత్రకారులు, పరిశోధకుల సమాచారం మేరకు మొల్లమ్మ మన జిల్లాలోని బద్వేలు వద్దగల గోపవరం గ్రామంలో జన్మించారు. కుమ్మరి (శాలివాహన) కులంలో పుట్టి సంఘం కట్టుబాట్ల పేరిట వివక్షను ఎదుర్కొన్న ఆమె తన రామాయణ రచనతో నాటి మహా పండితులు, విమర్శకుల ప్రశంసలు పొందారు. ఆమె జన్మస్థలి గురించి భిన్నమైన వాదనలు ఉన్నా పరిశోధకులు ఇటీవల ఆమె మన జిల్లాకు చెందిన వారేనని, మన బద్వేలువద్దగల గోపవరమే ఆమె జన్మస్థానమని బలమైన ఆధారాలు చూపారు.



బ్రౌన్ గ్రంథాలయంలో గల మొల్ల రామాయణ తాళపత్ర గ్రంథం

■ మొల్లమాంబ ఇంటి పేరుగా గల ఆతుకూరు (ఆత్మకూరు) ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఉన్నా విభజనకు ముందు అది మన జిల్లాలో ఉండేదని పరిశోధకులు తెలుపుతున్నారు. రామాయణ కావ్య రచన సమయంలో మొల్లమాంబ కూర్చొన్న బండ గ్రామంలో ఆమె పూజించిన శ్రీ కంఠ మల్లేశ్వరుని ఆలయం గోపవరంలోనే ఉండడంతో నివాస స్థలంపై విమర్శలకు తెర పడింది. అందిన సమాచారం మేరకు.... మొల్లమ్మ పుట్టుకతోనే తల్లిని కోల్పోయారు. తండ్రి కేశనశెట్టి చిన్న సైనికాధికారి. ఆమెను మేనమామ కుమారుడికి ఇచ్చి వివాహం చేయాలని భావించి నిశ్చితార్థం కూడా చేశారు. ఆ దశలో ఆ యువకుడు యుద్ధంలో మరణించగా మనస్థాపానికి గురైన మొల్లమ్మ ఇక తనకు పెళ్లే వద్దన్నది. తండ్రి ఆమె నిర్ణయాన్ని గౌరవించి చదువుకునే అవకాశం కల్పించారు. మొల్లమ్మ రామాయణ, భారత, భాగవతాధి గ్రంథాలను అధ్యయనం చేసింది. ఆ క్రమంలో రామాయణంపై మక్కువ ఏర్పడడంతోపాటు పద్య రచన అలవడింది. శైవం ప్రాచుర్యంలో ఉన్న ఆ రోజుల్లో తండ్రి ఆమెకు శివ దీక్షనిచ్చారు. శైవం, వైష్ణవం మధ్య తీవ్ర పోరు గల ఆరోజుల్లోనే ఆమె శైవాన్ని అనుసరిస్తూనే రామాయణ రచన చేయడమే గాక ఆ కావ్యాన్ని శ్రీరామచంద్రునికే అంకితం ఇచ్చింది.

రామాయణ పరిమళం..

మొల్లమ్మ రాసిన రామాయణానికి ఎంతో ఖ్యాతి లభించింది. వాల్మీకి సంస్కృతంలో 24 వేల శ్లోకాలతో రాసిన రామాయణాన్ని ఆమె కేవలం 871 పద్య గద్యాలతోనే రచించి తన సాహితీ ప్రతిభను ప్రపంచానికి చాటారు. పాత్రల చిత్రణలో కూడా తనదైన శైలి చూపారు. ఎంతో సహజంగా అనిపించే 'గుహుడు' పాత్రను చమత్కారంతో నింపి పండితులు, పామరుల ప్రశంసలందుకున్నారు. ఇతర రామాయణాల్లోలాగా కైకేయి పాత్రను అసూయ, ద్వేషాలకు ప్రతీకగా గాక విజ్ఞత, సమయస్ఫూర్తికి మారుపేరుగా చూపి మహిళ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేశారు. అందుకే తెలుగులో ఎన్ని రామాయణాలు ఉన్నా మొల్లమాంబ రచించిన రామాయణం తన ప్రత్యేకతను నిలుపుకుంటూనే ఉంది.

మన ఆడబిడ్డను గుర్తించాలి

తెలుగు కవయిత్రులలో ప్రత్యేకమైన స్థానం గల గోపవరం మొల్లమాంబ రచించిన రామాయణాన్ని ప్రభుత్వం పునర్ముద్రించి హైస్కూలు స్థాయి విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టాలని, ఆమె ఘనతను క్లుప్తంగా వివరించాలని ఆమె అభిమానులు, సాహితీవేత్తలు కోరుతున్నారు. యేటా మొల్ల జయంతి సందర్భంగా ఉత్సవాలను నిర్వహిస్తే మన జిల్లా ఆడబిడ్డకు ఘనంగా నివాళులర్పించినట్లు, ఆమె సాహితీగరిమను కొనియాడినట్లు ఉంటుందని పేర్కొంటున్నారు.



కడప కోటిరెడ్డిసర్కిల్‌లోని మొల్లమాంబ విగ్రహం

■ సాహితీవేత్త మొల్లమ్మకు వీరభక్తుడైన విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఆమె జన్మస్థలి గోపవరం మెయిన్‌రోడ్డు కూడలిలో ఆమె విగ్రహం ఏర్పాటు చేశారు. అక్కడ యేటా ఆమె జయంతి నాడు మహిళా దినోత్సవం ముగింపు ఉత్సవాలు, మొల్లమ్మ లేదా మహిళా సాహితీ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాకు చెందిన కొందరు శాలివాహనులతో కలిసి కడప నగరం కోటిరెడ్డిసర్కిల్‌లోగల మొల్లమాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తరుచూ పూజలు చేస్తున్నారు.

■ ఇటీవల బద్వేలుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శివశంకర్ ఆమెపై పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పట్టా తీసుకోవడంతోపాటు ఆమెపై పరిశోధన పుస్తకాన్ని కూడా వెలువరించారు. ఆమెపై గౌరవంతో యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఒక సమావేశ మందిరానికి ఆమె పేరు పెట్టారు. పలు విజ్ఞప్తుల మేరకు ఆమె జయంతి నాడు కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు ఆమె పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలి

కడప కార్పొరేషన్ : దళితుల భూములే లక్ష్యంగా అన్యాక్రాంతం చేస్తున్న వీఆర్‌ఓపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యులు డా. మునిశేఖరం డిమాండ్ చేశారు. బుధవారం తన కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎంతోమంది కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎమ్మార్వోలు బదిలీ అయ్యారుగానీ ఖాజీపేట మండలంలో పనిచేస్తున్న వీఆర్వో బాబు మాత్రం 25 సంవత్సరాలుగా ఒకే మండలంలో పనిచేస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేయడం వల్ల వ్యవస్థలోని లోపాలను తనకు అనుకూలంగా మలచుకొని ఇక్కడ పనిచేసిన అధికారుల సంతకాలను ఫోర్జరీ చేస్తూ దొంగ పాస్‌పుస్తకాలు తయారు చేసి దళితుల భూములను ఇతరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఎక్కడో గల్ఫ్‌లో పనిచేస్తున్న వ్యక్తి పేరున పాస్ పుస్తకాలు తయారుచేసిన ఘనత ఇతనికి ఉందన్నారు. సదరు వీఆర్‌ఓపై ఎన్నో ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు విచారించి ఆ వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్‌వీ నగర్‌కు చెందిన అబ్దుల్ రెహమాన్ బుధవారం గుర్రాలగడ్డ ప్రాంతంలో అక్రమంగా 18 బీర్ బాటిల్స్ ను విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇంటి పట్టాలపై సమగ్ర విచారణ జరపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని 15వ డివిజన్ సరోజినీ నగర్ దగ్గర ఉన్న ఆచార్య కాలనీలో ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు దళారుల చేతిలో ఉన్నాయని, భూకబ్జాదారులు వాటిని అమ్ముకుంటున్నారని తక్షణమే మండల తహసీల్దార్ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ డిమాండ్ చేశారు . బుధవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆచార్య కాలనీలో గత 30 సంవత్సరాల కిందట బడుగు బలహీన వర్గాలకు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారికి, క్రిస్టియన్ మైనార్టీలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. కానీ లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు ఇవ్వకుండా కొంత మంది వ్యక్తుల దగ్గర పట్టాలు ఉన్నాయన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్

ఇప్పుడు వాటిని కొంతమంది బినామీ పేర్లతో దొంగ పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నారని, దీనిపై మండల తహసీల్దార్, రెవిన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, నగర నాయకులు గోవిందు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అసంబద్ధమైన పద్ధతిలో విలీనం వద్దు

కడప ఎడ్యుకేషన్ : పాఠశాలల పునర్విభజన ప్రక్రియలో భాగంగా 3, 4, 5వ తరగతుల విలీన ప్రక్రియ అసంబద్ధమైన పద్ధతిలో చేపట్టవద్దని ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని చింతకొమ్మదిన్నె, అంగడి వీధి క్లస్టర్ స్కూల్ సమావేశాలకు హాజరైన ఉపాధ్యాయులతో కలిసి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ విలీన ప్రక్రియలో ఎస్ఎంసీ తీర్మానాలు పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు. కొన్ని మండలాల్లో ఉపాధ్యాయులను బెదిరించి బలవంతంగానైనా విలీన ప్రక్రియకు ఆమోదం తెలిపేలా ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం కిలోమీటర్ పరిధిలోని ప్రాథమిక, ఐదు కిలోమీటర్ల పరిధిలోని ఉన్నత పాఠశాల ఉండాలన్నారు. అయితే ఐదు కిలోమీటర్ల మేర ఉన్న బేసిక్ ప్రైమరీ పాఠశాలలన్నింటినీ ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చాలనే నిర్ణయం మంచిది కాదన్నారు. విలీన ప్రక్రియ ఆపకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు చెన్నకేశవరెడ్డి, ఓబులేసు, రమేష్, గుజ్జల తిరుపాల్, చంద్రోశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో కలిసి ఆందోళన చేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ ఈదురుబాష పేర్కొన్నారు. కడప నగరం నిర్మల నర్సింగ్ స్కూల్లో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. బాగా చదువుకుని సమాజానికి, దేశానికి సేవ చేయలన్నారు. తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం పోక్సో యాక్టు, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్-100, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఈదురుబాష

రాష్ట్రస్థాయిలో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : అమెరికా నాసా-ఎన్ఎస్ఎస్ స్పేస్ సెంటర్ లైవ్ ఇన్ హెల్తీ స్పేస్ డిజైన్ కాంపిటీషన్ (2024-2025)లో కడప శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ప్రైజ్ సాధించినట్లు చైతన్య విద్యాసంస్థల ఏజీఎం దేరంగుల రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ప్రతి ఏటా జరిగే నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ లోని లైవ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్ డిజైన్ కాంపిటీషన్లో మా విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటిన విద్యార్థులను ఆర్ఐ భాస్కర్ రావు, ప్రిన్సిపల్ కళ్యాణ చక్రవర్తి, అకడమిక్ కోఆర్డినేటర్ మదన్, డీన్ హరికృష్ణ, ఉపాధ్యాయులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.



ప్రతిభచాటిన విద్యార్థులతో చైతన్య విద్యాసంస్థల సిబ్బంది

పాఠశాలను తరలించవద్దు

చింతకొమ్మదిన్నె : విద్యాశాఖ అధికారులు కొప్పర్తి శివాజీనగర్‌లోని 3, 4, 5 తరగతి విద్యార్థులను మూడు కిలోమీటర్ల దూరంలోని ఎర్రమాసుపల్లెకు తరలించాలని అనుకున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు ఆగ్రహంతో బుధవారం శివాజీనగర్ మండల పరిషత్ స్కూల్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. పాఠశాలలో దాదాపు 40 మంది పిల్లలు ఉన్నారని ఆడపిల్లలకు భద్రత ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తూ తరలించే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొత్తపు శ్రీనివాసరెడ్డి, శివాజినగర్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో చదివిన విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్. పసుపులేటి శంకర్ ఆకాంక్షించారు. వైవీయూ 19 వ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల ఉత్సవాన్ని బుధవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో అతిథుల జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన పసుపులేటి శంకర్ మాట్లాడుతూ సాధించాలనే తపన, సంకల్పబలం ఉన్నవారే విజేతల జాబితాలో నిలుస్తారన్నారు. ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య యస్. రఘునాథ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అధ్యాపకులు నలుగురికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వచ్చాయని, అంతర్జాతీయ ఫెలోషిప్‌లు, ఎనిమిది మందికి పేటెంట్లు లభించాయన్నారు. ఇన్ ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాదిలో 56 మంది స్కాలర్లకు పీహెచ్‌డీ అవార్డులు ఇచ్చామన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్. ఐ. ఆర్. ఎఫ్) ర్యాంక్ 51నుంచి 100 లోపు వచ్చిందని తెలిపారు. న్యాక్ ఏ ప్లస్ సాధించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రొద్దుటూరు వైవీయు వైయస్సార్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రగతిని వివరించారు. అనంతరం వైవీయూ ఉపకులపతి ఆచార్య పి. ప్రకాష్ బాబు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు ఆచార్య చంద్రమతి శంకర్, డా. ప్రశాంతి మాదక్క, ముజీనా బేగం, పలు విభాగాల డీన్‌లు, ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య రమాదేవి, ఆచార్య ఎ.జి.దాము, ఆచార్య వై.సుబ్బరాయుడు, ఆచార్య చంద్ర ఓబుల రెడ్డి, అధ్యాపకులు పాల్గొని అతిథులతోపాటు పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో వివిధ కమిటీల కన్వీనర్లు, సభ్యులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్



నృత్యం చేస్తున్న విద్యార్థులు


జిల్లా వ్యాప్తంగా లాడ్జీల తనిఖీ



లాడ్జీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా లాడ్జీలను తనిఖీ చేశారు. లాడ్జీలలో పోలీసులు ప్రతి గదిని తనిఖీ చేసి, లాడ్జీలలో బసచేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ వారి వివరాలపై ఆరా తీశారు. లాడ్జీలలోని రిజిస్టర్‌లను పరిశీలించారు. లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జీల నిర్వాహకులు అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిర్వాహకులను సూచించారు.

యువత పోరు విజయవంతం



రవీంద్రనాథరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు

వల్లూరు : విద్యార్థులు, యువత పట్ల కూటమి ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య దోరణిని ప్రశ్నిస్తూ వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువత పోరు' విజయవంతం అయ్యిందని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కడపలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువకులు ఈ ఆందోళనల్లో స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అండగా నిలిచిన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పేదవారికి ఉచితంగా నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో 17 మెడికల్ కాలేజీలను ప్రారంభించిన వైఎస్ జగన్ ఐదేళ్లలోనే 5 కాలేజీలను పూర్తి చేసి అడ్మిషన్లు కూడా ఇచ్చారన్నారు. మిగతా కాలేజీలు వివిధ దశల్లో నిర్మాణం జరుపుకుంటుండగా వాటిని పూర్తి చేయాల్సిన సీఎం చంద్రబాబు సేఫ్ క్లోజ్ పేరుతో పక్కన పెట్టి రాష్ట్ర విద్యార్థులకు తీవ్ర ద్రోహం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బహిరంగ వేలం 18కి వాయిదా

కమలాపురం : నగర పంచాయతీలో 2025-26 సంవత్సరానికి దినసరి మార్కెట్టు, బస్టాండు, జంతు వధశాల, మార్కెట్ రూములు(7), గుత్త హక్కులు చెల్లించుటకు ఏర్పాటు చేసిన బహిరంగ వేలం ఈనెల 18కి వాయిదా వేశామని నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు.

హలీం రుచులు

కడప నగరంలో రమజాన్ పండుగ పురస్కరించుకొని ఉపవాసం దీక్షల విరమణలో ఒంటికి బలం ఇచ్చే పౌష్టిక ఆహారాలలో హలీం ఒకటి. పెద్ద పెద్ద నగరాలలో దొరికే ఈ ఆహారం ఇప్పుడు కడప నగరంలో తయారు చేస్తున్నారు. నగరంలో పలు చోట్ల ప్రత్యేకించి హలీం చేసే హోటళ్లు ఏర్పాటు చేశారు. ముస్లింలే కాకుండా నగరంలో అందరూ హలీం రుచులను ఆస్వాదిస్తున్నారు. ఆహా ఏమి రుచి.. అంటూ లొట్టలేసుకుంటూ తింటున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, కడప





పదవ తరగతి పరీక్షలపై అవగాహన

కడప కల్చరల్ : ప్రతి విద్యార్థికి ఏదో ఒక లక్ష్యం కలిగి ఉండాలని, ఆ లక్ష్యాన్ని చేరుకోవడం కోసం కష్టపడి చదివితే ఆ లక్ష్యం నీకు చేరువవుతుందని, అనుకున్న పనిని సాధించి తీరుతావని, పట్టుదలతో చదివితే ప్రతిదీ సాధ్యమేనని విశ్రాంత ప్రిన్సిపాల్ ఏలూరు ప్రభుదాస్ తెలిపారు. బుధవారం శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుదాస్ ఆర్థిక సహాయంతో మద్రాస్ రోడ్డులోని ఎస్సీ బాల, బాలికల వసతి గృహాలలో ఉన్న విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. వారికి అట్ట, పెన్ను, పెన్సిల్, రబ్బరు మొదలైన పరీక్షల సామాగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఏదో ఒక కల ఉంటుందని, దానిని నెరవేర్చుకునేందుకు పట్టుదల అవసరమన్నారు. పరీక్షలపై ఏమాత్రం భయం, ఆందోళన వద్దని, సాధారణ పరీక్షల మాదిరిగానే పరిగణించాలని, అప్పుడే పూర్తి విశ్వాసంతో, ఉత్తమ ఫలితాలను సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు, జార్జి హాస్టల్ వార్డెన్స్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేస్తున్న దృశ్యం

చెత్త నుంచి సంపద సృష్టించాలి

వల్లూరు : ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని పంచాయతీల జిల్లా కో ఆర్డినేటర్ సుజాత తెలిపారు. బుధవారం వల్లూరులోని ఎస్‌డబ్ల్యూపీసీలో పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్ర, క్లాప్ షెడ్ వారికి ఘన వ్యర్థాల నిర్వహణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌పీలు రాఘవ రెడ్డి, దేవేంద్రరెడ్డిలు గృహాల నుంచి చెత్త సేకరణ, పొడి రైతులతో పేడ ఒప్పందం, షెడ్‌కు తరలింపు, నాడెప్ ప్రిపరేషన్ వాటి పై ఆకు కూరలు పెంపకం, వర్మీ బెడ్ ప్రిపరేషన్, ప్రాసెసింగ్, ప్యాకింగ్ వరకు, పొడి చెత్త సెకండ్ లెవెల్ సెగ్రిగేషన్, షెడ్ రిజిష్టర్స్ నిర్వహణ, హరిత రాయబారులను నియమించడం తదితర అంశాలపై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను శుభ్రం చేయడం వలన గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించ వచ్చన్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటికి పర్యటించి హరిత రాయబారులు తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలన్నారు. దానిని ఎస్‌డబ్ల్యూపీసీకు చేర్చి వేరు చేసి సంపద సృష్టించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఈ ఆదాయం ద్వారా పంచాయతీలు అభివృద్ధి బాట పడతాయన్నారు. కార్యక్రమంలో వల్లూరు, కమలాపురం, వీఎన్‌పల్లె, ఎర్రగుంట్ల మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు పాల్గొన్నారు.